## ఎన్టీఆర్ ఫౌండేషన్కు దక్కిన గౌరవం



7

ఫౌండేషన్ సేవలను గుర్తించిన ప్రభుత్వం

రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు,

ప్రశంసా పత్రం మరింత ఉత్సాహంతో విస్తృతమైన సేవలు అందిస్తాం

ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



# ఖమ్మం

శుక్రవారం 2 అక్టోబర్ 2026 పేజీలు : 8


### విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులపై

# ప్రత్యేక దృష్టి పెట్టాలి



- రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- వార్డెన్ హాస్టల్‌లో ఉంటే 90 శాతం సమస్యలు పరిష్కారం
- హాస్టళ్లలో విద్యార్థులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తే కఠిన చర్యలు
- పాము, ఎలుక కాట్లు, ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలి
- నెలకోసారి స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలి
- కాంపౌండ్ వాల్ లేని హాస్టళ్ల ప్రతిపాదనలు సమర్పించాలి
- విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- లిగురుకుల పాఠశాల నిర్వహణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

2



## చికెన్ వ్యర్థాలతో

# ఛీ.. ఛీ.. రహదారులు!

దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి.. రహదారుల వెంట వ్యర్థాల కుప్పలు

పట్టించుకునే నాథుడే లేడా? అధికారుల పర్యవేక్షణపై ప్రజల ప్రశ్నలు

రైతుల ఆగ్రహం.. వాహనదారుల ఆవేదన.. తక్షణ చర్యలకు డిమాండ్

**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి:** రహదారులా.. వ్యర్థాల పారబోతకు అడ్డాలా? అన్నట్టుగా పరిస్థితి మారిందని తిరుమలాయపాలెం మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ దుకాణాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను రహదారుల పక్కన పడేస్తుండటంతో పలు గ్రామాల్లో దుర్వాసన సమస్య తీవ్రంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దమ్మాయిగూడెం, పిండిప్రోల్, మహ్మదాపురం, సుబ్లైడ్, హస్నాబాద్, బచ్చోడు, జుపెడ, కాకరవాయి, రఘునాథపాలెం గ్రామాల పరిధిలో రహదారుల వెంట చికెన్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. వ్యర్థాలు కుళ్లిపోవడంతో - మిగతా3లో

### కారేపల్లిలో సేవాలాల్ విజ్ఞాన కేంద్రం, 50 పడకల ఆసుపత్రి నిర్మించాలి.

అక్టోబర్ 10, 11న జరిగే గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.

తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం.

2



## సామాజిక న్యాయం, కులగణన కాంగ్రెస్ మాటలకే పరిమితం!

రెండు ఎమ్మెల్సీ సీట్లు రెడ్లకేనా?

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం ఎక్కడ?

బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి ఆకెన పవన్



5



### కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం

కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ప్రారంభం

1200 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాల అభివృద్ధి

7

# విద్య, వసతి, భోజనం, మౌళిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని, విద్య, వసతి,భోజనం, ఇతర మౌళిక వసతుల విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ గురువారం కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులు,రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులతో విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజనం, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం అత్యంత సున్నితంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ తెలిపారు. చిన్న పాటి ఘటనలను సైతం ఉన్నత స్థాయిలో పరిశీలిస్తున్నారని, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ప్రత్యేక విభాగం రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు.వార్డెన్ హాస్టల్‌లో ఉంటే 90 శాతం సమస్యలు పరిష్కారం సీనియర్ అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శిస్తున్నప్పటికీ, సంబంధిత హాస్టల్ వార్డెన్లు స్థానికంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షించడం అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు. వార్డెన్ హాస్టల్‌లోనే ఉండేలా చర్యలు తీసుకుంటే 90 శాతం సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. వచ్చే వారం నుంచి తాను రెసిడెన్షియల్ విద్యా సంస్థలను అర్ధరాత్రి,తెల్లవారుజామున వంటి అనూహ్య సమయాల్లో ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు. ఆ సమయంలో హాస్టల్ వార్డెన్ విధుల్లో లేకపోతే వెంటనే సస్పెన్షన్‌కు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విద్యార్థులతో పారిశుద్ధ్య పనులు

**చేయిస్తే కఠిన చర్యలు**

వంట సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోతే వారిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవచ్చని, పని చేయని సిబ్బందికి ఎలాంటి సిఫార్సులు చెల్లవని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించాలని అన్నారు.విద్యార్థులతో హాస్టల్ శుభ్రం చేయించడం వంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.నెలకోసారి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ పొదలు, పిచ్చి మొక్కలు పూర్తిగా తొలగించాలి.ప్రతి నెల ఒకసారి స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు లేదా మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు అధికారులు ముందుగానే షెడ్యూల్ రూపొందించాలని, నిర్ణయించిన తేదీన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం జరగకపోతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో హాస్టల్ పరిసరాల్లోని పొదలను పూర్తిగా తొలగించి, అనవసరమైన పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోజువారీ పారిశుద్ధ్య పనులను మాత్రం హాస్టల్‌లోని పారిశుద్ధ్య సిబ్బందే నిర్వహించాలని స్పష్టం చేశారు.ఫుడ్ పాయిజనింగ్‌కు మూడు కారణాలను పూర్తిగా నివారించాలి ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు ప్రధానంగా నాణ్యత లేని ముడి సరుకులు, వంట ప్రదేశం, పాత్రలు పరిశుభ్రంగా లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా కలుషితం చేయడం వంటి కారణాలు ఉండే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ మూడు అంశాలపై పూర్తి నియంత్రణ సాధించవచ్చని అన్నారు.స్టోర్ ఇన్‌చార్జిలు సరుకులను స్వీకరించే ముందు వాటి నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే సరుకులను తిరస్కరించాలని సూచించారు. వంట సిబ్బందికి ఆహారం కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇవ్వాలని, వంటశాల, పాత్రలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని స్పష్టం చేశారు.పాము, ఎలుక కాట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలి:లి

హాస్టళ్లలో విద్యార్థులకు పాము కాటు, ఎలుక కాటు వంటి ఘటనలు జరగడం ఏమాత్రం సహించరానివని కలెక్టర్ అన్నారు. ఎలుకలు, పాములకు సంబంధించిన సమస్యలు ఉన్న చోట ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిధులు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. విద్యార్థులకు పాము లేదా ఎలుక కాటు ఘటనలు జరగకుండా అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.కాంపౌండ్ వాల్ లేని హాస్టళ్లకు ఉపాధి హామీ పనుల క్రింద ప్రతిపాదనలు.కాంపౌండ్ వాల్ లేని హాస్టళ్ల వివరాలను సంబంధిత శాఖాధిపతులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. శాఖల నుంచి ప్రతిపాదనలు సమర్పిస్తే ఉపాధి హామీ పనుల క్రింద ప్రభుత్వ సంస్థల కేటగిరీలో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.వర్షాకాలంలో గోడలను తాకినప్పుడు విద్యుత్ షాక్‌కు గురయ్యే పరిస్థితులు ఉన్న భవనాల వివరాలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సాంకేతిక సవరణలు చేపట్టాలని ఆదేశించారు.పెండింగ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి.అన్ని విద్యాసంస్థల్లోని, హాస్టళ్లలో స్లాబ్ ప్లాస్టరింగ్, తదితర పెండింగ్ పనుల వివరాలను సమర్పించాలని, వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.లైంగిక వేధింపులపై జీరో టాలరెన్స్.. క్రిమినల్ కేసులు

**నమోదు**

రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులకు సంబంధించిన ఏ ఘటన జరిగినా జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎలాంటి ఘటననూ దాచిపెట్టే ప్రయత్నం చేయవద్దని, సమస్య ఉన్న వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.విద్యార్థులతో అధికారులు, వార్డెన్లు క్రమం తప్పకుండా మాట్లాడాలని, సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. హాస్టళ్లలో స్పష్టమైన విజిలెన్స్ వ్యవస్థ ఉండాలని తెలిపారు.విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితిపై నిరంతర

**పర్యవేక్షణ**

విద్యార్థుల ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ విద్యార్థికైనా జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే ఏఎన్ఎం వెంటనే స్పందించి వైద్య సేవలు అందించాలని, జ్వరం తగ్గకపోతే మెరుగైన వైద్యం కోసం అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేయాలని సూచించారు.ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులను గుర్తించి అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని, విద్యార్థులతో నిరంతరం మాట్లాడి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటే అనవసర ఘటనలను పూర్తిగా నివారించవచ్చని అన్నారు.డైట్, కాస్మోటిక్, అద్దె, విద్యుత్, సిబ్బంది జీతాల పెండింగ్ వివరాలు సమర్పించాలి.డైట్ చార్జీలు,పెండింగ్ బిల్లులను ప్రభుత్వం నుంచి త్వరలోనే క్లియర్ చేయించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. డైట్, కాస్మోటిక్ చార్జీలు, అద్దె చార్జీలు, విద్యుత్ బిల్లులు, ఏజెన్సీల వారీగా సిబ్బంది జీతాలు, తదితర అంశాల్లో ఎంత మొత్తం పెండింగ్‌లో ఉంది, సంబంధిత టోకెన్ నంబర్లతో సహా పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ వివరాల ఆధారంగా ప్రభుత్వంతో సంప్రదించి నిధులు త్వరగా విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.99 రోజుల పాటు అత్యంత సమర్థవంతంగా పనిచేసి ఒక్కరోజు నిర్లక్ష్యం చేసినా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రతి రోజు, ప్రతి సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.యూనిఫాం సరఫరా, పెండింగ్ వివరాలు సమర్పించాలి.ప్రతి రెసిడెన్షియల్ విద్యాసంస్థలో విద్యార్థులకు అందించాల్సిన స్కూల్ యూనిఫాంలు ఎంతమేరకు సరఫరా అయ్యాయి, ఇంకా ఎంతమేర పెండింగ్‌లో ఉన్నాయి అనే పూర్తి వివరాలను సంస్థల వారీగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మంజూరైన టాయిలెట్ నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశం లో జిల్లా ఎస్సి, బిసి అభివృద్ధి అధికారిణి జి.జ్యోతి, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి ముజాహిద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి, ఆర్ సీవో లు, హాస్టల్ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## కారేపల్లిలో సేవాలాల్ విజ్ఞాన కేంద్రం, 50 పడకల ఆసుపత్రి నిర్మించాలి.



కారేపల్లి, అక్టోబర్ 01, ప్రజా జ్యోతి : రాష్ట్రంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు.సింగరేణి మండల కేంద్రంలో గురువారం జరిగిన తెలంగాణ గిరిజన సంఘం మండల మహాసభకు అజ్మీరా శోభన్ నాయక్ అధ్యక్షత నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం హాజరైనారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి జరగాలంటే తండాల్లో మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి గిరిజన తండాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించాలని, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే మండల కేంద్రంలో ఎకరం భూమిని కేటాయించి సేవాలాల్ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నందున గిరిజనులు, సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోతు బాలాజీ నాయక్,తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జామారావు, సిఐటియు మండల కన్వీనర్ కే.నరేంద్ర, సంఘ నాయకులు బానోతు బన్సీలాల్, మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్ కుమార్ , వాంకుడోత్ రాందాస్ నాయక్, భూక్య రమేష్, తోపియా నాయక్, మాలోతు బాలునాయక్, వాంకుడోత్ శ్రీనివాస్ నాయక్, ధరావత్ వినోద్ నాయక్,మాలోతు బాలు, బానోత్ శ్రీను, భూక్య రాంబాబు, వాంకుడు రాందాస్ నాయక్,ధరావత్ రవికుమార్, బానోత్ వెంకటేశ్వర్లు, అజ్మీర రామదాసు, ధరావత్ వినోద్ కుమార్, మాలోత్ శ్రీను, భూక్య రమేష్,అజ్మీర శ్రీను, వాంకడోత్ బాబురావు, రవి నాయక్, వాంకడోత్ ధడ సింగ్, నునావత్ వెంకన్న, కిషన్, భూక్య రాజేష్, బానోత్ రాజేష్, బానోత్ బాల తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారంలో ‘అమ్మ’ మెడికల్ షాప్ ప్రారంభం

**తక్కువ ధరలకు మందులు.. గ్రామస్థులకు అందుబాటులో వైద్య సేవలు**



**సత్తుపల్లి అక్టోబరు01(ప్రజా జ్యోతి)** గ్రామీణ ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కిష్టారం గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మ మెడికల్ షాప్ గురువారం ప్రారంభమైంది. మెడికల్ షాప్ నిర్వాహకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు, ముఖ్య అతిథులుగా హాజరై మెడికల్ షాప్ ను ప్రారంభించారు. వైద్యరంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న కువ్వారపు సతీష్, భవాని దంపతులు ఈ మెడికల్ షాప్‌ను ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు అవసరమైన మందులు స్థానికంగానే లభించేలా, తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామంలోనే మందులు అందుబాటులోకి రావడంతో, ప్రజలకు సమీపంలోనే వైద్య అవసరాలు తీర్చుకునే అవకాశం కలుగుతుందని కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ప్రారంభించిన మెడికల్ షాప్‌కు గ్రామస్తులు ఆదరణ అందించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కువ్వారపు రాజా, గోపమ్మ గ్రామ పెద్దలు నరుకుళ్ళ రవి, నరుకుళ్ళ వెంకటేశ్వరరావు (ఎన్టీఆర్), కోనపురి చిరంజీవి, గ్రామ గ్రామస్థులు పాల్గొని సతీష్, భవాని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన సిడిపిఓ కె ఉమా.

**కారేపల్లి, అక్టోబర్ 01, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని



గొల్లగూడెం 2 అంగన్వాడి కేంద్రంలో గురువారం సిడిపిఓ కె. ఉమా ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మాట్లాడుతూ ప్రతి తల్లి సరైన పౌష్టికాహారం తీసుకోవాలి,అంగనవాడి కేంద్రం నుంచి అందించే పౌష్టికాహారాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆమె అన్నారు. తల్లి పౌష్టికాహారం తీసుకోకపోతే రక్తహీనత, వివిధ రకాల అనారోగ్యాలు వస్తాయి. తల్లి అనారోగ్యంతో ఉంటే పిల్లలు అనారోగ్యాల పాలవుతారు, పిల్లలు బుద్ధి మాద్యం,ఎదుగుదల లోపాలు, వివిధ రకాల అనారోగ్యాల పాలవుతారు. అందుకు ప్రతి తల్లి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుగులోత్ వరలక్ష్మి ,ఉప సర్పంచ్ పొదుగు విజయ, సూపర్వైజర్ సత్య శీల, అంగన్వాడీ టీచర్స్, గ్రామంలోని తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలి

**బోనకల్ సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ**

**స్వచ్ఛమైన వాతావరణంతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే**

**బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు**

**గ్రామ అభివృద్ధిలో పారిశుధ్యం కీలకమైన అంశం**

**బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ**

**“ఒక రోజు.. ఒక గంట.. అందరం కలిసి” నినాదంతో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం**

బోనకల్, అక్టోబర్ 01(ప్రజా జ్యోతి):

స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా “ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్” నినాదంతో నిర్వహించిన మెగా శ్రమదానం కార్యక్రమం బోనకల్ మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బోనకల్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొని గ్రామంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన ప్రాంతాలు, రహదారుల వెంట, మురుగు కాలువల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి నిత్య బాధ్యతగా భావించాలని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ తరఫున నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.




ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలతో పాటు వీధులు, ప్రధాన రహదారులు, కాలువల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు.“మన గ్రామం--మన బాధ్యత” అనే భావనతో ప్రతి ఒక్కరూ పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, తడి--పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలని సర్పంచ్ సూచించారు. స్వచ్ఛమైన వాతావరణం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా గ్రామానికి పరిశుభ్రమైన రూపాన్ని తీసుకురావచ్చని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో పారిశుధ్యం కీలకమైన అంశమని, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బోనకల్ గ్రామాన్ని పరిశుభ్రతలో ఆదర్శంగా నిలిపేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండ, పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరితో పాటు పంచాయతీ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఏరియాలో డైరెక్టర్ విస్తృత పర్యటన

**జేవియర్ ఓసి.2,3తనిఖీ ప్రాజెక్ట్ సరిహద్దుల పై ప్రత్యేక సమీక్ష**

**సత్తుపల్లి అక్టోబర్01(ప్రజా జ్యోతి )** సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనుల పరిధిలో బొగ్గు ఉత్పత్తి పెంపుదల, నాణ్యతా ప్రమాణాల పరిశీలన, భవిష్యత్ నూతన ప్రాజెక్టుల పురోగతిని వేగవంతం చేసే



లక్ష్యంతో సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ ఌ ప్రాజెక్ట్స్) కే. వెంకటేశ్వర్లు గురువారం సత్తుపల్లి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో ఆయన వెంట సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ఎన్. వెంకటచారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పర్యటనలో ముఖ్యంగా ఓసి–2 ఉత్పత్తి పురోగతి, జేవియర్ ఈపిసి, సిహెచ్ పి ద్వారా బొగ్గు రవాణా, విజయవాడ రోడ్ డైవర్షన్, మరియు ప్రతిపాదిత ఓసి ..3ప్రాజెక్ట్ సరిహద్దులు, విస్తరణ అవకాశాలు ప్రధాన ప్రాధాన్య అంశాలుగా సమీక్ష నిర్వహించారు.డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు, జీఎమ్ శ్రీ ఎన్. వెంకటచారి మరియు ఉన్నతాధికారులతో కలిసి తనిఖీ అనంతరం నూతనంగా ప్రతిపాదించిన ఓసి–3 ప్రాజెక్ట్ స్థలాన్ని మరియు గనుల విస్తరణ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం జనరల్ మేనేజర్ ఆఫీసు నందు ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్తుపల్లి ఏరియాలో బొగ్గు గనుల విస్తరణకు ఉన్న భౌగోళిక, సాంకేతిక మరియు రవాణా అనుకూలతలను అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సిబ్బంది ఉన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లకు సన్మానం

ఎర్రుపాలెం ప్రజా జ్యోతి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పార్టీ ఆదేశాల మేరకు ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు



అనుమోలు సురేష్, జిల్లా నాయకులు, నూతక్కి.నరసింహారావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు అంగన్ మిలన్ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్వాడి టీచర్లను వారి సేవలు గుర్తించి గురువారం అంగన్వాడి టీచర్లకు సన్మానం చేశారు.మండలంలోని రేమిడిచర్ల, లక్ష్మీ నగర్, అంగన్వాడీ,టీచర్, ఆదిలక్ష్మి,రేమిడిచర్ల, అంగన్వాడి, టీచర్లు, రాధ, యోగేశ్వరి, అరుణ,టీచర్లను, సన్మానించారు.సఖినేవీడు గ్రామంలో రెండు అంగన్వాడి సెంటర్ లను సందర్శించి అంగన్వాడి టీచర్ని ఆయాను మరియు ఆశ వర్కర్లను శాలువ తో సన్మానించారు. ఈ సందర్భంగా పిల్లలకు గర్భిణీ స్త్రీలకు అందించే పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంగనవాడి సిబ్బందిని మరియు ఆశ వర్కర్లను సేవలను గుర్తించారని వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నూతక్కి నరసింహారావు,కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కొమ్మినేని కృష్ణారావు మండల ఉపాధ్యక్షులు రావిరాల అచ్చారావు , సఖినేవీడు గ్రామ బూత్ అధ్యక్షులు వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్థానిక నాయకులు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# నాపై కావాలని తప్పుడు కేసు పెట్టారు.

**నేను గ్రామాభివృద్ధిలో ఎలాంటి రాజకీయాలు చేయలేదు. బానోతు రామదాసు.**



**కారేపల్లి, అక్టోబర్ 01, ప్రజా జ్యోతి:** నేను, నా కుటుంబం గ్రామ అభివృద్ధికి పాటుపడ్డాము గ్రామ అభివృద్ధిలో ఎలాంటి రాజకీయ తారతమ్యాలు చూపలేదు అని భానోత్ రాందాస్ నాయక్ అన్నారు. సింగరేణి మండల పరిధిలోని బజ్యా తండా గ్రామపంచాయతీ బోక్కల తండా నివాసి మాజీ సర్పంచ్ భర్త మండల ఏ వన్ కాంటాక్ట్ అయిన బానోత్ రామదాసు నాయక్ గురువారం సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా గ్రామ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు అతని అనుచరులు నాపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నాడని ఆయన అన్నారు. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం గత ఐదు సంవత్సరాలు నా భార్య సర్పంచ్ గా పనిచేశాది, గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో అతను సర్పంచ్ గా గెలిచాడు. మేము ఓడిపోయాం కానీ రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలి ఎన్నికలు అయిన తర్వాత ప్రతి ఒక్కరము గ్రామ అభివృద్ధి కోసం పాటుపడాలి కానీ హనుమంతరావు ప్రతి విషయానికి రాజకీయాలు చేస్తూ కక్షపూరితమైన ఉద్దేశంతో గ్రామంలో గొడవలు సృష్టిస్తున్నాడు. గత వారం రోజుల క్రితం వినాయక నిమజ్జనం సందర్భంగా యువత ఊరేగింపుతో వెళుతుంటే సర్పంచ్ మందు తాగి వచ్చి బానోతు శ్రీను అనే మైనర్ బాలుని కొట్టినాడు, ఆ విషయమై గ్రామస్తులందరూ మా ఇంటికి వచ్చి చెప్పగా నేను మాట్లాడదామని సర్దిచెప్పి పంపించాను. ఆ విషయాన్ని తప్పుగా భావించి సర్పంచ్ నాపై గ్రాములో కొందరు యువకులపై తప్పుడు కేసు పెట్టాడు. దౌర్జన్యంగా గ్రామంలో మాట్లాడుతున్నాడు ఇది ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. మేము సర్పంచ్ గా ఉన్నప్పుడు మా గ్రామపంచాయతీ పరిధిలో ఎలాంటి కేసులు కాలేదు ఏదైనా చిన్న చిన్న సమస్యలున్న గ్రామంలో పెద్దల సమక్షంలో కూర్చొని సరిచేసుకున్నాము కానీ స్టేషన్ కి వెళ్ళలేదు. ఈ సర్పంచి గెలిచిన కానించి గ్రామములో కేసులు గొడవలు ఉదృతం అవుతున్నాయి, ఇలా గ్రామంలో అలజడులు సృష్టించడం మంచిది కాదని ఆయన తెలిపారు. నేను ఏదైనా తప్పు చేస్తే ఎప్పటికైనా శిక్ష అనుభవిస్తాను, తప్పు నిరూపిస్తే నేను ఎంతటి శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. ఇలా గ్రామాలలో రాజకీయాలు చేస్తూ తప్పుడు కేసులు పెట్టడం గ్రామ అభివృద్ధికి ఆటంకం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలోతు సత్య, హట్కర్ భాస్కర్, అజ్మీర కుమార్, అజ్మీరా మంగ్య, భూక్య రవి, బానోతు దేవ, భూక్య హరి, బానోతు శ్రీను, అజ్మీర పవన్, మాలోతు నవీన్, మాలోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృషివ్ రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు.

## పాఠశాల విద్యార్థులకు, వృద్ధులకు సేవా కార్యక్రమాలు.





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని వెంకటాపురం సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, లక్ష్మి దంపతుల ఏకైక మనుమడు, బొగ్గుల నరేంద్ర రెడ్డి--స్వాతి (యుఎస్ఏ) దంపతుల కుమారుడు బొగ్గుల కృషివ్ రామ్ రెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి కృషివ్ రామ్ రెడ్డిని ఆశీర్వదిస్తూ, వారి మేనమామలు మీ సేవ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు యరమల శ్రీనివాసరెడ్డి, మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కర్నాటి సుధాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. తదుపరి మధిరలోని ఆదరణ సేవా ఫౌండేషన్ లో వృద్ధులకు అన్నదానం నిర్వహించి, పండ్లు, మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. చిన్నారి కృషివ్ రామ్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆశీర్వదించారు. చిన్నారుల పుట్టినరోజులను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రత్నమ్మ, వెల్లంకి నాగరాజు, ఆదరణ సేవా ఫౌండేషన్ నిర్వాహకులు నిస్సి హరిణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెన్నపూస కృష్ణారెడ్డి, నాయకులు వేముల వెంకటేశ్వరరావు, వెర్రు వెంకటేశ్వరరావు, బూసుపల్లి వెంకటరెడ్డి, మేకల రమేష్, ఉపాధ్యాయులు రామారావు, రవిసంతోషం, కవిత, లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం టూ టౌన్,ఖమ్మం అర్బన్, ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లుగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం అర్బన్, ఖమ్మం ట్రాఫిక్, ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్లకు (ఎస్ హెచ్ ఓ )స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు జె.రామకృష్ణ,యం.నాగరాజు,కెశివప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని కొణిజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2025 మార్చి 15 న నమోదైన కేసులో న్యాయస్థానం నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది.

**కేసు వివరాలు**

కొణిజర్ల మండలం, మల్లుపల్లి గ్రామం,గ్రామపంచాయతీ పంప్ ఆపరేటర్ అయిన దారావత్ సీతారాములు,(48 సం,,) అనే వ్యక్తి అదే గ్రామంలో బానోత్ బాలాజీ ఇంటి వద్ద డ్రైనేజి చెత్త తీసే విషయంలో తరుచు గొడవపడుతూ,ఉద్దేశ్యపూర్వకంగా తన చేతిలో ఉన్న పికాసి పార తో బాలాజీ తలపై కొట్టగా తలపగిలి తీవ్ర రక్త గాయం అవడంతో బాధితుల ఫిర్యాదు తో కొణిజర్ల పోలీస్ స్టేషన్ లో కొణిజర్ల పీఎస్ క్రైమ్ నం. 66/2025, రాజ.చీశీ. 52/2025, సెక్షన్ 109(1) దీచీూ కింద కేసు నమోదైంది.నిందితుడిపై నేరం రుజువు కావడంతో సెక్షన్ 109(1) బి ఎన్ ఎస్ కింద ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష ఆర్ ఐ తో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం రెండోవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు,ఇన్‌చార్జి కోర్టు స్పెషల్ ఉమెన్ కోర్టు-ఐదోవ అదనపు జిల్లా ఢ సెషన్స్ కోర్టు,గౌరవ న్యాయమూర్తి వాసుకుల శ్రీనయ్య తీర్పు చెప్పారు.జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.ఈ కేసులో దర్యాప్తు అధికారిగా ఎస్సై జి .సూరజ్,వ్యవహరించారు.అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి .వి .డి . లక్ష్మి,కోర్టు కానిస్టేబుల్ పి . మల్లిక్ హరి రావు, కోర్టు లైజన్ ఎస్సై కె .శ్రీకాంత్, హోంగార్డ్ అధికారి సయ్యద్ యూసఫ్ సేవలందించారు.

## ఓట్లు తొలగిస్తే హైదరాబాద్ మంటలే

**హైదరాబాద్ :** నగరంలో ఓట్ల తొలగింపు వ్యవహారం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ అంశంపై మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ తన వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ మొత్తం తగలబడిపోతుందని వ్యాఖ్యానించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల సంఘం అధికారులు బీజేపీతో కుమ్మక్కై పనిచేస్తున్నారని దానం నాగేందర్ ఆరోపించారు.

# మట్టిలో మాణిక్యం మాణిక్యారం ఆణిముత్యం తమ్మిశెట్టి శ్రీనివాస్.

**కారేపల్లి, అక్టోబర్ 01, ప్రజా జ్యోతి:** మట్టిలో మాణిక్యం, మాణిక్యారం ఆణిముత్యం తమ్మిశెట్టి శ్రీనివాస్ అని వ్యక్తలు అన్నారు. సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరర్ తమ్మిశెట్టి శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నిక కాబడ్డాడు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన యొక్క బోధనను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించి సన్మానించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం, విద్యార్థులు కలిసి ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అతిధులు పాల్గొని శాలువాలతో, పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సింగరేణి మండలం మారుమూల ఏజెన్సీ గ్రామమైన మాణిక్యారం గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన తమ్మిశెట్టి మట్టిలో మాణిక్యం లాంటివాడు నిరుపేద కుటుంబంలో జన్మించిన ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఒడిదుడుకులను ఎదుర్కొంటూ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకున్నారు. చరిత్ర కనుమరుగవుతున్న ఈ రోజుల్లో చరిత్రకే ఆద్యం పోస్తూ విద్యార్థులకు చరిత్ర గురించి అర్థమయ్యే రీతిలో క్లుప్తంగా వివరించటం ఆయనొక్కడికే సాధ్యమవుతుంది, చరిత్ర చెప్పే ఉపాధ్యాయులు లేక హెచ్ఈసి గ్రూపు కనుమరుగవుతున్న టైంలో ఇలాంటి అధ్యాపకులు ఉండటం వలన కళాశాలలో హెచ్ ఈ పి గ్రూపు బ్రతికున్నాయని వారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. విజయకుమారి జేజమ్మ, శివగామి, రాజమాత లాంటిది ఆమె




ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకుడగు దుర్గాప్రసాదరావు ఖండాంతరాలు దాటి జపాన్ దేశానికి ప్రభుత్వం పంపటం, తమ్మిశెట్టి బోధనలు గుర్తించి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా గుర్తింపురావడం ఆమె ప్రోత్సవం వలన అని వారన్నారు. ఈ మండల వాసులైన టువంటి వారికి రాష్ట్ర అంతర్జాతీయ గుర్తింపు వచ్చినటువంటి అధ్యాపకులు వలన మండలానికి గర్వకారణం అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెల రవీందర్, శాంతి నగర్ కళాశాల ప్రిన్సిపల్ గోవిందరావు, చర్ల ప్రిన్సిపల్ నరేందర్,టైగ్లా రాష్ట్ర ఉపాధ్యక్షులు డీపీ గణేష్, టేకులపల్లి ప్రిన్సిపల్ పవన్, జిల్లా హౌసింగ్ బోర్డు అధ్యక్షులు శేషు ప్రసాద్, కళాశాల అధ్యాపక,అధ్యాభాకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యూజిలాండ్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు రానున్న టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 యూనియన్ వ్యవస్థాపకులు మామిడి సోమయ్యకు ఘన స్వాగతం

జిల్లా అధ్యక్ష కార్యదర్శులు
నానబాలరామకృష్ణ అర్వపల్లి నగేష్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** న్యూజిలాండ్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్యకు ఖమ్మం




జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికేందుకు జర్నలిస్టులు సిద్ధమయ్యారు.విదేశీ గడ్డపై పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొని, అక్కడి మీడియా రంగ పరిస్థితులను అధ్యయనం చేసి తిరిగి వస్తున్న తమ ప్రియతమ నేతకు ఆత్మీయ స్వాగతం పలకడం సంతోషకరమని జిల్లా కమిటీ నాయకులు తెలిపారు.జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన చేస్తున్న నిరంతర పోరాటం రాష్ట్రంలోని జర్నలిస్టు లోకానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు.విదేశీ పర్యటన ముగించు కుని స్వస్థలానికి వస్తున్న మా రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య కి ఖమ్మం జిల్లా జర్నలిస్టుల తరఫున హృదయపూర్వక స్వాగతం–సుస్వాగతం" అని జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు,వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు,జర్నలిస్టు మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.జర్నలిస్టుల ఐక్యతే బలం జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం మామిడి సోమయ్య కి ఖమ్మం జిల్లా జర్నలిస్టులు ఘన స్వాగతం

## గురవయ్యకు ఘన నివాళులర్పించిన ఎమ్మెల్సీ తాత మధు మాజీ ఎమ్మెల్యేలు.



**కారేపల్లి,అక్టోబర్ 01,ప్రజా జ్యోతి :** సింగరేణి మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వల్లభనేని గురవయ్య సంతాప సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యేలు బానోతు చంద్రావతి, లావుడియా రాములు నాయక్ గురవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.అనంతరం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మహిళా రైతు తాత ఉమా కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాత మధు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సూడా బీఆర్ఎస్ నాయకులు వేణు, ఇల్లందు మాజీ మున్సిపాలిటీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ ముత్యాల సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి పున్నం వీరేందర్,ముత్యాల వెంకట అప్పారావు,రావూరి శ్రీనివాసరావు, మండేపూడి సత్యనారాయణ,బానోత్ రాందాస్, తాత వెంకన్న,వేగ్గలం నాగా చారీ తదితరులు పాల్గొని ఘన నివాళు లర్పించారు .

## "చికెన్ వ్యర్థాలతో ఛీ.. ఛీ.. రహదారులు!"



-మొదటిపేజీ తరువాయి

దుర్వాసన వ్యాపిస్తోందని, రాకపోకలు సాగించే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. రహదారి పక్కనే వ్యర్థాలు పడేయడంతో ఆ ప్రాంతాల్లో వాతావరణం దుర్వాసనతో నిండిపోతోందని స్థానికులు చెబుతున్నారు. వ్యర్థాల వద్ద కుక్కలు, ఇతర జంతువులు చేరడంతో పరిస్థితి మరింత అసహ్యకరంగా మారుతోందని అంటున్నారు.

**రైతుల ఆగ్రహం...వాహనదారుల గోడు**

పొలాలకు వెళ్లే మార్గాల్లోనే వ్యర్థాలను పడేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారుల వెంట వ్యర్థాలను పారవేయకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."రహదారిపై ప్రయాణించాలంటే దుర్వాసన భరించాల్సిందే" అంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. రహదారుల వెంట వ్యర్థాలు పడేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల పరిధిలో ఇలాంటి వ్యర్థాల పారవేతను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. వ్యర్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు పడేస్తున్నారు? వాటిని ఎందుకు నియంత్రించడం లేదు? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, రహదారుల వెంట వ్యర్థాల పారవేతకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు,

## సామాజిక న్యాయం, కులగణన కాంగ్రెస్ మాటలకే పరిమితం!

**బోనకల్, అక్టోబర్ 01 (ప్రజా జ్యోతి):** సామాజిక న్యాయం, కులగణన అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి ఆకెన పవన్ విమర్శించారు. తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం ఏ విధమైన సామాజిక న్యాయమని ప్రశ్నించారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, పదవుల భర్తీలోనూ అదే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి.. పదవుల్లో మాత్రం అన్యాయమా? అని ప్రశ్నించారు. కులగణనను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, బీసీలకు చట్టసభలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో సముచిత వాటా కల్పించాలని కోరారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆకెన పవన్ స్పష్టం చేశారు.

## భూక్య రాములు కు ఘన నివాళి

**దశదిన కార్యక్రమానికి హాజరైన**
**మాజీ జడ్పీటీసీ బానోతు కొండ**

**బోనకల్, ఆగస్టు 01(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని గిరిజన తండా కు చెందిన భూక్య రాములు ఇటీవల మృతి చెందగా గురువారం జరిగిన దశదిన కార్యక్రమంలో బోనకల్ మాజీ జడ్పీటీసీ బానోతు కొండ పాల్గొన్నారు. ముందుగా రాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాములు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ బానోతు కొండ మాట్లాడుతూ.. భూక్య రాములు మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని అన్నారు. రాములు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాములు కుటుంబానికి ఎల్లప్పుడూ తన



సహకారం ఉంటుందని, ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చని బానోతు కొండ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి దుఃఖంలో తాను కూడా భాగస్వామినని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో బోనకల్ మాజీ ఎంపీటీసీ గంగుల శ్రీనివాసరావు, శ్రీనివాస్ రాథోడ్, భూక్య శ్రీను, షేక్ బాజీ, యోగి శ్రీనివాస్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు గుగులోతు పంతు నాయక్, గుగులోతు రూప్ల, బాలాజీ, గోపి, రాములు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు, స్నేహితులు, స్థానికులు తదితరులు ఉన్నారు.

## పిన్నబోయిన మారేశ్వరరావుకు డాక్టరేట్

**రామనగరం వాసికి డాక్టరేట్"**




**సత్తుపల్లి అక్టోబర్01(ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని రామా నగరం గ్రామము వాస్తవ్యులైన పిన్న బోయిన. భూషయ్య, మంగమ్మ గార్ల కుమారుడు పిన్నబోయిన. మారేశ్వరరావు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూనివర్సిటీ అయిన రాయలసీమ యూనివర్సిటీలో పి హెచ్ డి డాక్టర్ కుర్ర రాజశేఖర్ రావు ఆధ్వర్యంలో" ఇంప్రూవ్ అండ్ ఎంహాన్సుడ్ సెక్యూరిటీ అప్రోచెస్ టు ఇంప్రూవ్ ప్రైవసీ ఎన్హాన్సింగ్ అండ్ మల్టీ యాక్సెస్ కంట్రోల్ పాలసీస్ ఇన్ సోషల్ నెట్వర్క్" అనే అంశంపై పరిశోధన చేసి ఆ ప్రతులను యూనివర్సిటీ నందు సమర్పించడం ద్వారా డాక్టరేట్ పట్టా పొందినారు. వీరి ప్రాథమిక విద్యాభ్యాసం రామనగరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు, ఉన్నత విద్యాభ్యాసం నాచారం ఉన్నత పాఠశాల నందు, గ్రాడ్యుయేషన్ కాకతీయ యూనివర్సిటీ నందు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ నందు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పీ హెచ్ డి ఆంధ్రప్రదేశ్ స్టేట్ యూనివర్సిటీ అయిన రాయలసీమ యూనివర్సిటీ నందు పూర్తి చేశారు.వీరు గత రెండు దశాబ్దాలుగా మదర్ తెరిసా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో వివిధ హోదాలలో పనిచేస్తున్నారు. వీరు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్డీ ని పూర్తి చేసిన సందర్భంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, మదర్ తెరిసా విద్యాసంస్థల ప్రెసిడెంట్ చలసాని సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీ కొత్తూరి ప్రభాకర్ రావు, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ కందిమల్ల కృష్ణారావు , డైరెక్టర్స్ శ్రీ కంచర్ల సత్యనారాయణ, శ్రీ కొత్తూరు సత్యనారాయణ, కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా వృద్ధుల దినోత్సవం వేడుకలు



**నేలకొండపల్లి, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** మండలం లోని పైనంపల్లి లో టీడీజీపీసీ, శ్రీ రూరల్ డెవలప్మెంట్ "సొసైటీ ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. వయో వృద్ధుల పట్ల కుటుంబంలో, సమాజంలో గౌరవ భావంపెరగాలని సూచించారు. ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పి.వీ.చలమయ్య, సర్పంచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బీజెపీ ఆధ్వర్యంలో వయో వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్. కందరబోయిన వెంకటరమణ, సూరేపల్లి, జ్ఞానరత్నం, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ దేవాలయంకు

## మంత్రి రూ.3 లక్షలు విరాళం.



**నేలకొండపల్లి, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** మండలం లోని మంగాపురంతండా లో నూతనంగా నిర్మించనున్న సేవలాల్, మరియు మేరమ్మ యాడి దేవాలయం కు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.3 లక్షల విరాళం ను అందించారు. గురువారం తన క్యాంపు కార్యాలయం లో స్థానిక సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి లకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫామ్ కుట్టులో

## తేడాలు ఉంటే సహించేది లేదు.

**జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు.**





**నేలకొండపల్లి, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి:** ఈ నెల చివర వారం లోపు ప్రతీ విద్యార్థికి రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులను అందించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు సూచించారు. మండలం లోని నాచేపల్లి ప్రభుత్వ పాఠశాల ను గురువారం సందర్శించారు. మధ్యాహ్నం భోజనం ను పరిశీలించారు. నిత్యవసర సరుకులు, కూరగాయలను తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి విద్యా ప్రగతి ని పరిశీలించారు. పాఠశాల కు టాయిలెట్స్, ప్రహరీగోడ, డైనింగ్ హాలు కావాలని డీఈవో కు నివేదించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఐకేపీ అధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. పాఠశాలలకు వెళ్లే. యూనిఫామ్ జాప్యం పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నెల చివర -నాటికి విద్యార్థులకు అందాల్సిందేనన్నారు. కుట్టు లో కూడ తేడాలు. ఉండటానికి వీలు లేదన్నారు. చాలా చోట్ల కుట్టు పై విమర్శలు వస్తున్నాయని...వాటిని సరిచేయటానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూనిఫామ్ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఐకేపీ ఏపీయం కట్టా సురేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార మాసంలో పౌష్టికాహారం తప్పనిసరి



**నేలకొండపల్లి, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి :** పోషకాహార మాసాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని కోరుట్లగూడెం అంగన్వాడి టీచర్ బచ్చలకూరి నిర్మల సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా,గ్రామ పెద్దలు చిన్నారులు తల్లులు పాల్గొన్నారు

## ఆసరా పెన్షన్ల వెరిఫికేషన్ గడువు మరో నెల పెంచాలి

బిఎస్పీ మండల అధ్యక్షులు బొద్దు బాబురావు



**నేలకొండపల్లి, అక్టోబర్ 1** ప్రజా జ్యోతి : ఆసరా పెన్షన్ల అప్లికేషన్ వెరిఫికేషన్ గడువును మరో నెల రోజుల పాటు పెంచాలని బిఎస్పీ నేరకొండపల్లి మండల అధ్యక్షులు బొద్దు బాబురావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత అనేక సంవత్సరాలుగా వితంతు పెన్షన్, వృద్ధాప్య పెన్షన్, దివ్యాంగుల పెన్షన్, ఒంటరి మహిళ పెన్షన్ లబ్ధిదారులు ఇలా ఆసరా పెన్షన్ల గురించి అప్లికేషన్లు పెట్టుకొని ఎప్పుడు మాకు పెన్షన్ వస్తుందో అని అర్హులైన పేదలు ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ తరుణంలో ఆసరా పెన్షన్ల వెరిఫికేషన్ చేసి అర్హులైన వారికి మంజూరు చేస్తామని ప్రభుత్వ ప్రకటనతో సంతోషించిన పేదలకు నేటి గడువు ముగుస్తున్న ఇప్పటివరకు ఎవరు కూడా మా దగ్గరికి వెరిఫికేషన్ కు రాలేదని ఇంకా అనేకమంది దిగులుతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కావున తెలంగాణ ప్రభుత్వం స్పందించి ఇంకో 30 రోజుల పాటు పెన్షన్ల వెరిఫికేషన్ గడువును పెంచాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ ఏఎంసి దోమా

ప్రతి ఒక్కరు డ్రగ్స్ కు దూరంగా ఉండండి సీఐ శ్రీహరి



**సత్తుపల్లి అక్టోబర్01(ప్రజా జ్యోతి)** ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, డ్రగ్స్ పట్ల దూరంగా ఉండాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ సీఐ తుమ్మల శ్రీహరి అన్నారు. బుధవారం సత్తుపల్లి హౌస్ పెయింటర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేంసూర్ రోడ్ లో గల షాదీఖానాలో ఐడి కార్డు లు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా వారు హాజరైనారు. అనంతరం ప్రతి ఒక్కరికి ఐడికారులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెయింటింగ్ వర్క్స్ చాలా కఠిన తరమైనది కాబట్టి, ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ప్రయాణాలలో హెల్మెట్ కలిగి ఉండాలని, డ్రగ్స్ దూరంగా ఉండాలని వారు వర్కర్స్ తో అవగాహన కల్పించారు. చిన్న, చిన్న పొరపాటులతోటి జీవితాలను పాడు చేసుకోవద్దని, ప్రాణాలతో సమానంగా పనిచేస్తుంటారు కాబట్టి, మీ వెనుక కుటుంబం ఆధారపడి ఉంటుంది, తల్లిదండ్రులు ఉంటారు కాబట్టి ప్రతి పని విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. యూనిటీగా ఉండటం, ఐడి కార్డులు పంపిణీ చేసుకోవడం అందరూ ఒకే తాటిగా ఉండటం అభినందనీయమని యూనియన్ ను అభినందించారు. అనంతరం వారిని అందరూ కలిసి బొకే, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ షేక్ సత్తార్,వైస్ ప్రెసిడెంట్ రాంబాబు ట్రెజరర్ దేశి రెడ్డి ప్రసాద్ రెడ్డి, పెయింట్ వర్కర్స్ ఉన్నారు.

# పేదోడి సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పాకనాటి కన్నారెడ్డి





**నేలకొండపల్లి, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి:** పేద ప్రజల చిరకాల స్వప్నమైన సొంత ఇంటి కలను తెలంగాణ ప్రభుత్వం నెరవేరుస్తోందని గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పాకనాటి కన్నారెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కర్ల పూజారాణి ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తుంబూరు దయాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని తెలిపారు. పేదలకు ఇళ్లు ఇస్తున్నందుకు ప్రజలంతా మంత్రి తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటమల్ల పుల్లమ్మ పంచాయతీ కార్యదర్శి మహేష్ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తిగుళ్ల భాస్కర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తిగుళ్ల భవాని, మేకల అర్జున్, చెరుకుపల్లి రాజేష్, చెరుకుపల్లి ఉపేందర్, వద్లమూడి నరసయ్య, వద్లమూడి వెంకటేశ్వర్లు, కర్ల అశోక్, కుమ్మరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం

**సత్తుపల్లి అక్టోబర్01(ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని,సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రుద్రాక్షపల్లి పంచాయతీ లో రుద్రాక్షపల్లి పంచాయతీ ప్రజలకు సుమారు 1200 స్మార్ట్ రేషన్ కార్డ్స్ పంపిణీ చేసినారు. రుద్రాక్షపల్లి గ్రామం, కొమ్ముగూడెం, బాసారం, తోగ్గుడెం, రంగాపురం, సత్యం పేట గ్రామం లో మొత్తం కలిపి 28 సీసీ రోడ్లు గాను రూ.. 1.50 లక్షలు రూపాయలు నిధులతో నిర్మాణం పూర్తి చేసిన సందర్భంగా సీసీ రోడ్లు ప్రారంభించినారు. గ్రామ పంచాయతీ లో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు రూ..4 కోట్ల రూపాయలు తో సత్తెమ్మ గుడి రోడ్, 3 స్త్రీ శక్తి భవనాలు, ఆర్ ఓ వాటర్ ప్లాంట్, సోలార్ మోటర్స్, సోలార్ లైట్స్, ఇందిరమ్మ మొదటి విడత లో 42 ఇల్లు ఇచ్చిన సందర్భంగా ప్రజలకు అభివృద్ధి పూర్తి చేసిన సందర్భంగా వివరించారు. అంతే కాకుండా రుద్రాక్షపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధి లో భాగం గా గ్రామం లో 10 సీసీ కెమెరా లు, ప్రారంభించిన నారు.ముఖ్యం గా రుద్రాక్షపల్లి వైకుంఠ దామం లో దహన కార్యక్రమం కు ఉచితంగా కట్టెలను ఉచితంగా ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పాలన ఏర్పడినప్పటి నుంచి ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలకు అందుతుందని, గతంలో రుద్రాక్ష పల్లి పంచాయతీలో రోడ్లకు మోక్షం లేక మాకు విన్నవించారని, అదే స్ఫూర్తితో గెలిచిన వెంటనే వాళ్ళ కు మంజూరు చేయించి, ప్రారంభం కూడా చేసామని, మాట ఇచ్చి కట్టుబడి ఉండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు, రుద్రాక్షపల్లి గ్రామ సర్పంచ్ పాయం నాగేంద్ర బాబు, ఉపసర్పంచ్ భూపతి రెడ్డి,సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు భరత్ కుమార్ బత్తుల, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దామోదర్ రావు పిన్నమనేని, ఖమ్మం జిల్లా నాయకులు హలవత్ అర్జున్,నాయకులు వసంత రావు, సారా రవి, సోయం సత్యం, తాటి నాగేష్, వార్డు నెంబర్స్, రుద్రాక్షపల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,సత్తుపల్లి మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, ప్రజలు,లబ్ధిదారులు,మహిళలు పాల్గొన్నారు.



## అగ్రహారంలో స్వచ్ఛత హీ మెగా శ్రమదానం

**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం అగ్రహారం గ్రామంలో గురువారం స్వచ్ఛత హీ మెగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. శ్రమదానంలో భాగంగా రోడ్లకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను ,గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లెల స్వాతి ఉపేందర్ మాట్లాడుతూ..గ్రామంలో పరిసరాల పరిశుభ్రత మీద అందరూ దృష్టి సారించాలని కోరారు. శ్రమదానం కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం ఉందని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ముమ్మరంగా పారిశుద్యం పనులు పూర్తి చేసినట్లు స్వచ్ఛత హీ మెగా శ్రమదానం ద్వార గ్రామంలో ఎటువంటి చెత్త ,పిచ్చి మొక్కలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల స్వాతి ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరమ్మ,గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎన్జీఆర్ ఫౌండేషన్కు దక్కిన గౌరవం

**నెలకొండపల్లి, అక్టోబర్ 1 ప్రజా జ్యోతి:**
నేలకొండపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల పేదలు, విద్యార్థులు, యువత మహిళలకు అనేక రకాలుగా విస్తృతమైన సేవలు అందిస్తున్న ఎన్జీఆర్ ఫౌండేషన్కు ఎట్టకేలకు అరుదైన గౌరవం దక్కింది. గత 45 నెలలుగా మండల కేంద్రంలోని స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు ఫౌండేషన్(ఎన్జీఆర్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశిష్ట సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు గురువారం హైదరాబాదు లోని రవీంద్రభారతిలో జరిగిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026 సందర్భంగా నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా వారు చేస్తున్న సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వ అవార్డు ప్రశంసా పత్రాన్ని రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావుకు అందించారు. ఈ సందర్భంగా ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో కార్పొరేట్ వైద్యం అత్యంత ఖరీదైపోయిందన్నారు. కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందించాలనే సంకల్పంతో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు ఫౌండేషన్ పేరుతో స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో నెల నెల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ పేదలకు అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు కిడ్నీ వ్యాధులు, లివర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, ఇతర సాధారణ జబ్బులకు నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 100 రూపాయలకే బిపి, షుగర్ మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. వీటితోపాటు ఉచిత క్యాన్సర్ మెగా వైద్య శిబిరాన్ని కూడా అనేకమార్లు నిర్వహించడం ద్వారా ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలు కలిగిన రోగులను ముందస్తుగా గుర్తించి వారికి నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు సహకరించామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కంప్యూటర్ విద్య, మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ,




దివ్యాంగులకు అవసరమైన శిక్షణ తరగతుల నిర్వహణకు సహకరిస్తూ అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం పాటుపడుతున్నామన్నారు. ఎన్జీఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందించడం మాపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. రానున్న కాలంలో రెట్టించిన ఉత్సాహంతో విస్తృతమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందడంతో పాటు వారికి మరింత దగ్గర అయ్యేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఎన్జీఆర్ ఫౌండేషన్ సేవలను గుర్తించి అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన అవార్డు అందుకున్న వారిలో ఎన్జీఆర్ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ చెరువు నరసింహారావు, ఫౌండేషన్ సభ్యులు కొంగర నారాయణరావు, మందడపు, శ్రీనివాసరావు, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, షేక్ జమాల్ పాషా, గుత్తా లక్ష్మీనరసయ్య, స్వాతంత్ర సమరయోధుల సంస్థ వారసుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్ రెడ్డి రాజశేఖర్, ఫౌండేషన్ శ్రేయోభిలాషులు సాదినేని నరసింహారావు, గరిమెళ్ళ రామారావు, ఏటుకూరి రమ్య, తుళ్లూరి వినీత తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ ఒకటి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అక్టోబర్ 1 అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఖమ్మం జిల్లాలోని స్థానిక టీటీడీసీ భవనం లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జిల్లాలోని అన్ని మండలాల నుంచి సుమారు 400 మంది వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమాన్ని డి ఆర్ డి ఓ,అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డి ఆర్ డి ఓ మాట్లాడుతూ, వృద్ధుల సంక్షేమం, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.వృద్ధుల అనుభవాలు సమాజానికి ఎంతో విలువైనవని, వారి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు.అనంతరం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వృద్ధులతో ఆనందాన్ని పంచుకున్నారు. వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను శాలువాలతో సన్మానించి, వారికి గొడుగులను బహుమతులుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వృద్ధుల హక్కులు, ఆరోగ్యం, సామాజిక భద్రత, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు తమ జీవిత అనుభవాలను పంచుకుని,తమ కోసం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీమతి ప్రమీల,ఐసిడిఎస్ అధికారులు, ఎస్ ఇ ఆర్ పి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు డీపీఎం పోలేపొంగు. ఆంజనేయులు ఏపీఎం వై .పద్మలత సీఓ కె . వీరభద్రం సి ఓ వి . నవీన్ అడ్మిన్ అసిస్టెంట్ ఎస్ . పూర్ణిమ జిల్లా సమాఖ్య అధ్యక్షులు కుక్కల సంధ్య ,కార్యదర్శి విజయ కోశాధికారి సుమాంజలి జెడ్ ఎస్ మేనేజర్ రత్నాకర్ సి ఓ నాగమణి, అటెండర్టి .మధు సీసీఎస్ వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.వృద్ధుల పట్ల గౌరవం సమాజం యొక్క బాధ్యత అనే సందేశంతో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రారంభానికి ముందే పగుళ్లుబారిన 'ముష్టికుంట్ల' సీసీ రోడ్డు

**అడుగడుగునా నిలువుగా అడ్డంగా పగుళ్లు**

**పర్యవేక్షణలో విఫలమైన ఉన్నత అధికారులు**

**కాంక్రీట్ మిశ్రమం, సిమెంట్ నిష్పత్తులను పక్కన పెట్టిన వైనం**

**కనీస నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్**

**పగుళ్లు తేలిన నాసిరకం రోడ్డును తొలగించాలి**

**అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు**





**బోనకల్, అక్టోబర్ 1 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో స్మశాన వాటిక నుంచి ఖమ్మం బోనకల్ ఆర్ అండ్ బి రోడ్డు వరకు ప్రభుత్వ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం కాంట్రాక్టర్ల అక్రమాలకు, నాసిరకం పనులకు నిదర్శనంగా మారింది. రోడ్డు ప్రారంభానికి నోచుకోకముందే అడుగడుగునా నిలువునా, అడ్డంగా పగుళ్లు తేలి ఊడిపోతోంది. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా చుట్టేసిన ఈ నిర్మాణం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణంలో వేయాల్సిన కాంక్రీట్ మిశ్రమం, సిమెంట్ నిష్పత్తులను పూర్తిగా పక్కనబెట్టి పనులు కానిచ్చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నాణ్యమైన క్యూరింగ్ చేయకపోవడం, సరైన పునాది లేకుండానే కాంక్రీట్ వేయడంతో నిర్మాణం పూర్తయిన కొద్దిరోజులకే రోడ్డు బీటలు వారింది. ప్రజల పన్నుల సొమ్మును నాణ్యత లేని పనులతో కాంట్రాక్టర్లు స్వాహా చేస్తుంటే, పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం క్షేత్రస్థాయికి రాకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేస్తూ నాసిరకం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లపై, పర్యవేక్షణలో విఫలమైన అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపించాలని ముష్టికుంట్ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పగుళ్లు తేలిన ఈ నాసిరకం రోడ్డును తొలగించి, పక్కా నాణ్యతా ప్రమాణాలతో కొత్త రోడ్డును నిర్మించాలనీ గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శిథిలావస్థకు చేరిన చెరువుమాదారం

# కాలువ నియంత్రణ గేటు..

### ప్రమాదకరంగా మారిన వైనం..

### పునర్నిర్మించాలని గ్రామస్థుల విజ్ఞప్తి



**నేలకొండపల్లి, అక్టోబరు 1 ప్రజా జ్యోతి:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపురం తండా సరిహద్దులోని చెరువుమాదారం కాలువ నియంత్రణ గేటు శిథిలావస్థకు చేరుకుంది.కాలువ నియంత్రణ వ్యవస్థ దెబ్బతినడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గేటు వద్ద పలు చోట్ల ఇనుప భాగాలు తుప్పుపట్టి,నిర్మాణం బలహీనంగా మారినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. వర్షాకాలంలో కాలువలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. మంగాపురం తండా, చెరువుమాదారం, రాయిగూడెం గ్రామాల ప్రజలకు సంబంధించిన ఈ కాలువ నియంత్రణ గేటును సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించి, కాలువ ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి,అవసరమైన నిధులు కేటాయించి పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గేటు సక్రమంగా పనిచేయకపోతే సాగునీటి పంపిణీలో అంతరాయం ఏర్పడి రైతులు నష్టపోయే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ నియంత్రణ గేటు మరింత దెబ్బతినకముందే అధికారులు స్పందించి మరమ్మతులు లేదా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని,ప్రజలకు మరియు రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంగాపురం తండా, చెరువుమాదారం, రాయిగూడెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పనులు పూర్తయ్యే వరకు ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి,గేటు పరిసరాల్లో ప్రజలు వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కూడా వారు సూచిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# పునీత కుటుంబంగా మార్టిన్ దంపతుల కుటుంబం



ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఓసిడి కౌన్సిలర్ రెవ. ఫా. విన్సెంట్

కల్లూరులో ఘనంగా పునీత చిన్నతేరేజమ్మ మహోత్సవం



**కల్లూరు, అక్టోబర్ 01: ప్రజా జ్యోతి** పునీత చిన్నతేరేజమ్మ చిన్న పుష్పమని జీవిత చరిత్ర ఎంతో గొప్పదని ఒకే కుటుంబము నుండి తల్లి తండ్రి మరియు పునీత చిన్నతేరేజమ్మ అని పవిత్రతకు నిలయమైన ఈ కుటుంబం ఎంతో గొప్పదని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఓసిడి కౌన్సిలర్ రెవరెండ్ ఫాదర్ విన్సెంట్ అన్నారు. గురువారం కల్లూరు మున్సిపాలిటీలోని పునీత చిన్న తేరేజమ్మ దేవాలయ మహోత్సవ వేడుకలు కల్లూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ చరణ్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్లూరు ఆర్సిఎం చర్చి ప్రాంగణంలోని 10 గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కౌన్సిలర్లకు కోలాటంతోని నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో దివ్య బలి పూజ సమర్పించారు. అనంతరం ఫాదర్ విన్సెంట్ మాట్లాడుతూ పునీత చిన్న తేజమ్మ అసలు పేరు తేరేజ మార్టిన్ అని 1873 జనవరి రెండో తారీఖున ఫ్రాన్స్ దేశంలోని అలెన్కాన్ లూయిస్ మార్టిన్-జెలీ మార్టిన్ దంపతులకు జన్మించిన చిన్న తేరేజమ్మ చిన్నప్పటినుండి ఏసు ప్రభు పట్ల ఎంతో ప్రేమ కలిగి కన్య స్త్రీ జీవితం ప్రభువు పట్ల ప్రేమ భక్తి విశ్వాసంతో 17 ఏళ్ల వయసులోనే కార్మెల్ మఠంలో చేరాలని ఎంతో ప్రయత్నించి పోప్ గారిని కూడా కలిసి అనుమతి పొందిన గొప్ప స్త్రీ అని 1888లో మిస్ యు కార్మెల్ మఠంలో చేరి అక్కడ తొమ్మిది సంవత్సరాలు నాలుగు గోడల మధ్యనే జీవించి ఎప్పుడు బయటకు వెళ్ళేది లేదు దేశాలలో తిరిగి సువార్త ప్రకటించలేదు ఆమె బోధన పవిత్రతకు గొప్పగొప్ప పనులు చేయనవసరం లేదు చేసే ప్రతి చిన్న పనిలో ప్రేమతో చేయాలని గొప్పగా నమ్మే స్త్రీ అని కొనియాడారు. మదర్ తెరిసా పేరులో తెరిసాగా మార్చుకొని మదర్ తెరిసాగా చేసిన సేవలు పవిత్రతకు నిలయమైన స్త్రీ అని నేను స్వర్గం నుండి గులాబీల వర్షం కురిపిస్తాను అంటే కృపల వర్షం అని అర్థం అని అన్నారు అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు చేపట్టి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం సాయంత్రం పురవీధులలో పునీత చిన్న తేరేజమ్మ స్వరూపాన్ని ఊరేగింపుగా క్రైస్తవ భక్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఓసిడి కౌన్సిలర్లు రెవరెండ్ ఫాదర్ శౌరి కళ్యాణ్, క్రీస్తు బాబు, సత్తుపల్లి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ లూర్తు, కల్లూరు లిటిల్ ఫ్లవర్ మేనేజర్ రెవరెండ్ ఫాదర్ జాక్విన్, తల్లాడ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఆనంద్, కల్లూరు విచారణ కన్య స్త్రీలు, మర్యాదలం సభ్యులు, ప్యారిస్ కమిటీ, సంఘస్తులు, క్రైస్తవులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వరిలో ముగి పురుగు కంకి నల్లి నివారణ చర్యలు చేపట్టాలి

## మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి



**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలంలోని భగత్వీడు గ్రామంలో మొగి పురుగు కంకి నల్లి ఆశించిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మొగిపురుగు ఆశించడానికి అనుకూల పరిస్థితులని ఇటువంటి సమయంలో సరైన నివారణ మార్గాలు పాటించాలని సూచించారు.ఈ పురుగు ఆశించిన చిన్న మొక్కల్లో మధ్య కాడ ఎండిపోవడం ,పిలకలు వచ్చిన దశలో తెల్ల కంకులు ఏర్పడటం,కాండంలో పురుగు రంధ్రాలు, వ్యర్థాలు కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని, పురుగు ఉదృతి తీవ్రంగా ఉంటే దిగుబడి తగ్గుతుందని సూచించారు. దీని నివారణకు పొలంలో కలుపు మొక్కలు, పంట అవశేషాలను తొలగించాలని,అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని నివారించాలని తెలిపారు.పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50%ఉ్రా 400 గ్రాములు లేదా కొరాజెన్ 18.5% రాజ 60 మి.లీ లేదా కార్బోసల్ఫాన్ 25%జుజ 400 మీ.లీ లేదా ఫిప్రోనిల్ 5% రాజ 400 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీళ్లలో కలిపి పిచికారి చేయవచ్చని సూచించారు.

అదే విధంగా వరిలో కంకి నల్లి కూడా గమనించడం జరిగిందని , ఈ కంకి నల్లి ఆశించినపుడు ఆకులపై పసుపు లేదా గోధుమ రంగు మార్పులు కనిపిస్తాయని,ఆకులలో పత్ర హరితం తగ్గి, తెల్లటి మచ్చలు ఏర్పడతాయని,కంకి బయటకు రావడంలో ఆటంకం కలుగుతుందని గింజలు సరిగా నిండక దిగుబడి తగ్గుతుందని తెలిపారు.దీని నివారణకు స్పైరోమెసిఫిన్ 22.9 % రాజ లీటరు నీటికి 1.0 గ్రాము చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వేదవ్యాస్ రైతులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి సందర్భంగా మాంసం, చికెన్ విక్రయాలు నిలిపివేత

## నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు, జరిమానా: మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణ రెడ్డి

**కల్లూరు, అక్టోబర్ 01: ప్రజా జ్యోతి** అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా కల్లూరు పురపాలక సంఘం పరిధిలో మాంసం, చికెన్ విక్రయాలను సంపూర్ణంగా నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణ రెడ్డి తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అహింసా సిద్ధాంతానికి గౌరవం కల్పించే ఉద్దేశంతో పట్టణ పరిధిలోని అన్ని మాంసం, చికెన్ విక్రయ దుకాణాలను అక్టోబర్ 2న మూసివేయాలని కమిషనర్ సూచించారు. జంతువుల వధ, జీవహింసకు పాల్పడటం నిబంధనలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కల్లూరు పురపాలక సంఘం పరిధిలోని మాంసం, చికెన్ వ్యాపారులు మున్సిపల్ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అక్టోబర్ 2న ఎలాంటి మాంసం లేదా చికెన్ విక్రయాలు నిర్వహించరాదని, దుకాణాలను పూర్తిగా మూసివేయాలని సూచించారు. మున్సిపల్ ఉత్తర్వులను ధిక్కరించి ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించినట్లయితే, సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, జరిమానా విధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని




స్పష్టం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా అహింస, పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని కమిషనర్ కోరారు. మున్సిపాలిటీ జారీ చేసిన ఆదేశాలకు పట్టణంలోని మాంసం, చికెన్ వ్యాపారులు, ప్రజలు సహకరించి గాంధీ జయంతిని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఏం బి బి ఎస్ సిటు సాధించిన భరణిపాడు యామినికి గ్రామస్తులు అభినందనలు

**వేంసూరు అక్టోబర్ 1 ప్రజాజ్యోతి** వేంసూరు భరణిపాడుగ్రామానికి చెందిన బిసి కాలనీ వాసులు నామా రమేష్ నాగిని కుమార్తె నామా యామిని కి జగిత్యాల లో ఎంబీబీఎస్ చదవడానికి ఉచితంగా సీటు రావడం మన గ్రామానికి ఎంతో అదృష్టం అని గ్రామ పెద్దలు మందపాటి మహేశ్వరరెడ్డి అన్నారు ఎందుకంటే ఎన్ని వేలు డబ్బులు పెట్టిన సీటు దొరకడం కష్టం గా ఉన్న ఈ రోజుల్లో తెలంగాణా రాష్ట్రములో మారు మూల గ్రామం లో ఉన్న యామిని సీటు సంపాదించినందుకు గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేసారు ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ నాయకులు మందపాటి మహేశ్వరరెడ్డి మందపాటి వెంకటరెడ్డి మందపాటి వెంకట రామిరెడ్డి ఆదర్యం లో నామా యామిని ని ఘనంగా సత్కరించుకోవడం జరిగింది ఈ యొక్క కార్యక్రమనికి విచ్చేసిన స్కూల్ హెచ్ యం బూరుగు సుజ్యాన్ రాజు శ్రీనివాస్ పంచాయతీ సెక్రటరీ రాజు స్కూల్ సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది మరియు పంచాయతీ నంబర్ లు మహిళలుగద్దల వెంకమ్మ




లంకారాధ గ్రామపెద్దలుగ్రామనాయకులు మందపాటి ప్రసాదరెడ్డి బొంతు ప్రసాద్ మందపాటి సూరిబాబుగొర్ల వెంకటప్పరెడ్డి మందపాటి వెంకటరెడ్డి మాదిరాజుమురళిషేక్ బాలయ్య షేక్ సలిమ్ తెలగారపుప్రసాద్ సూరటిప్రసన్న పబ్బుశ్రీనుబోయ యేసు సింగపోగురాజేష్ పరసాబాలకృష్ణపరసా వెంకటేష్ పరసావీరయ్య విసంపల్లినాగులు జూంజునూరివెంకటేష్ తదితరులు పాల్గున్నారు

# మధిరలో వైభవంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు.

## హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం

**మధిర ప్రజా జ్యోతి** పట్టణంలో గురువారం గ్యార్మీ వేడుకలను స్థానిక ముస్లిం యువకుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో ముస్లిం సోదరులు పాల్గొని ప్రార్ధనలు జరిపారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా గ్యార్మీ షరీఫ్ పవిత్ర జెండాతో ర్యాలీ నిర్వహించారు. యువకులు ప్రదర్శించిన ఈ ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ హాజరు**

ఈ పవిత్ర కార్యక్రమానికి మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈఈ సందర్భంగా ఆమె దర్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి, సర్వజనుల శ్రేయస్సును కోరుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఇలాంటి వేడుకలలో అందరూ భాగస్వాములు కావడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్



తలుపుల వెంకటేశ్వర్లు కౌన్సిలర్లు షేక్ రసూద్దీన్, బొల్లెద్దు విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక లారీ పట్టివేత నిందితులపై కేసు నమోదు

**వేంసూరు అక్టోబర్ 1 ప్రజాజ్యోతి** వేంసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రదీప్ తెలిపారు. ఈ నెల 29న




పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎర్రగుంటపాడు - లంకపల్లి మార్గంలో లారీ (టీజీ 04 ఖజు 6819) ని తనిఖీ చేసి, అనుమతులు లేకుండా ఏపీలోని కొవ్వూరు నుండి తరలిస్తున్న 34 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. రేజర్లకు చెందిన లారీ యజమాని-కమ్-డ్రైవర్ కోనకళ్ల చందు, వివిఎమ్ బంజారాకు చెందిన మధ్యవర్తి బండారి చెన్నారావుతో కలిసి టన్ను రూ. 1,200 చొప్పున అక్రమంగా విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి లారీని సీజ్ చేయడమే కాకుండా నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టి లారీ యజమాని-కమ్-డ్రైవర్ కోనకళ్ల చందు ని రిమాండ్ కు తరలించారు. ఈ క్రమంలో మండలంలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీకుంటామని తెలియచేస్తున్నాం

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

## బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కార్యక్రమం



**కల్లూరు, అక్టోబర్ 01: ప్రజా జ్యోతి** కల్లూరు మండల కేంద్రంలోని ఓబుల్ రావు బంజారా అంగన్వాడీ కేంద్రంలో 9వ జాతీయ పోషణ మాస కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్వైజర్ జె. సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ చిన్నారులు గర్భిణులు బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పోషకాహారం ప్రాధాన్యత పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్ధాలపై డిసిపియు సోషల్ వర్కర్ అన్నపూర్ణ అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ ఎం. అనురాధ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా అందుతున్న వివిధ సేవలు సౌకర్యాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామదర్శి వి. శ్రావణి ఓబుల్ రావు బంజర ఎంపీ పీ ఎస్ ప్రధానోపాధ్యాయులు టి. రవి ఉపాధ్యాయురాలు సిహెచ్. రజిని, అంగన్వాడీ టీచర్లు ఎం. వరలక్ష్మి, ఏ. శైలజ, ఏఎన్ఎం చిట్టెమ్మ, ఆశ కార్యకర్తలు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేలపట్ల గ్రామ రికార్డులను పరిశీలించిన ఎంపీఓ హనుమంత్.



**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం నేలపట్ల గ్రామ పంచాయతీను గురువారం ఎంపీఓ హనుమంత్ సందర్శించారు. దానిలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి మరీదు అరుణను రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.. అలాగే గ్రామ పంచాయతీ రికార్డ్స్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ హనుమంత్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ సభకు సంబంధించిన తీర్మానాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పనుల గురించి ఆరా తీశారు. ప్రతి నెల గ్రామాల సందర్శన, రికార్డుల పరిశీలన కొనసాగుతుందని అన్నారు. ఎవరు అలసత్వం వహించిన చర్యలు ఉంటాయని తెలిపారు..

## అంగన్వాడీ కేంద్రం దేశ భవిష్యత్..

**సర్పంచ్ బానోతు భిక్షం నాయక్.**



**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం గురువాయిగూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారం మహోత్సవం ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భానోత్ బిక్షం నాయక్ పోషణ మాసం ఉత్సవాలను ప్రారంభించి అన్న ప్రసన్న కార్యక్రమం, చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణి స్త్రీలకు ఉద్దేశించి మాట్లాడారు. అంగన్వాడి సేవలను అందరు వినియోగించుకోవాలని, అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న పోషకాహారం గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పిల్లలకు ఎంతో అవసరం అన్నారు .అలాగే పోషక విలువలు ,వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సువర్చల, అంగన్వాడి టీచర్ సారాబుట్ల వెంకటలక్ష్మి, బానోతు సునీత పంచాయతీ కార్యదర్శి కుశ , వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**ఒకరోజు శ్రమదానం కార్యక్రమం.**

గురువాయిగూడెం గ్రామంలో గురువారం స్వచ్ఛత హీ మెగా శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు.. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న చెత్త చెదారాన్ని తొలగించారు.. ఏక్ దిన్ ఏ గంట ఒక రోజు ఒక గంట అందరూ కలిసి మెగా శ్రమదానం కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోతు బిక్షం నాయక్, పంచాయతీ కార్యదర్శి పాలిత్య కుశ, వార్డ్ మెంబర్లు భాను సతీష్ నాయక్, పాలకుర్తి దుర్గారావు, బానోత్ పద్మ, పుట్టపర్తి రమాదేవి, ఆశా వర్కర్లు గ్రామ దీపిక అంగన్వాడీ టీచర్లు అంగన్వాడీ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బెల్టులు ,సాక్స్ అందించిన సర్పంచ్ అనూష.







**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 1 ప్రజా జ్యోతి** కూసుమంచి మండలం గైగోళ్ళపల్లి గ్రామ శివారు గ్రామం ఉడతలగూడెంలోని ప్రైమరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల , అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థినులకు సర్పంచ్ అనూష సైదులు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న షూస్,బెల్ట్,సాక్స్ లు అందిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ కోసం ఉచిత షూస్ ,బెల్ట్ ,సాక్స్ ,బట్టలు , బుక్స్ అందిస్తుంది.. ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని తల్లిదండ్రులకు , గ్రామానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చే స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రమాదేవి పుల్లయ్య ,జిల్లా ఉమా హుస్సేన్ , బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తోడేటి మల్లయ్య ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మక్కపల్లి పుల్లయ్య, తోడిటి వీరన్న ,నవీన్, ఉపేందర్, వెంకన్న, లింగమల్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు ,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా పోలీసు స్కూలుకు రెండు కోట్ల విరాళం

### ఎంవైకే సంస్థకు డీజీపీ కృతజ్ఞతలు

**హైదరాబాద్ :** తెలంగాణ డీజీపీ సి. వి. ఆనంద్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపిఎస్) అకాడమిక్ బ్లాక్ నిర్మాణానికి ?2 కోట్ల సీఎస్సార్ అందించిన ఎంవైకే లాటిక్రెట్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ సిబ్బంది పిల్లలతో పాటు సాధారణ పౌరుల పిల్లలకు కూడా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటువంటి సంస్థలు అందించే సహకారం వైఐపిఎస్ లో మెరుగైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి, విద్యార్థులకు ఎన్నో సంవత్సరాల పాటు ఉపయోగపడే సౌకర్యాలను కల్పించడానికి తమ ప్రయత్నాలకు ఎంతో విలువైన తోడ్పాటును అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సీఎస్సార్ ఫండ్ ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు దోహదపడుతుందని డీజీపీ తెలిపారు. ఎంవైకే లాటిక్రెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురళి యాదమా, అయన వారి బృందానికి ఈ కార్యక్రమంలో భాగస్వాములైనందుకు డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు. వైఐపిఎస్ ద్వారా ప్రయోజనం పొందే విద్యార్థులకు వారి ఈ సహకారం చిరకాలం గుర్తుండిపోయే విలువైన మద్దతుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## బీసీలకు కనీసం ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలి

**రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2027 మార్చిలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని బీసీలకు కేటాయించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ స్థానాలను అగ్రకులాలకు కేటాయించే నిర్ణయంపై పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు.రెండు స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని బీసీలకు కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించాలని కోరారు.ఒకవైపు కులగణన సామాజిక న్యాయం,బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతూ మరోవైపు బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకపోవడం సరికాదన్నారు.బీసీలకు జనాభా ప్రాతిపదికన తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బడుగు,బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెబుతున్నారని అదే విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు.ఎమ్మెల్సీ స్థానాల విషయంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు పునరాలోచించి బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ.

**హోళగుంద :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అవ్వ తాతలు,వికలాంగులు, వితంతువులు,ఒంటరి మహిళలు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా గౌరవప్రదంగా పెన్షన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఈబిజీ గోవింద గౌడ అన్నారు.గురువారం ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి ఈర్లకట్ట కాలనీ,బుడగజంగాల కాలనీ పరిసర ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం?ప్రతి ఇంటికీ భరోసా,ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అవ్వతాతలు, అర్హులైన లబ్ధిదారుల జీవితాల్లో భరోసా నింపుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎర్రి స్వామి,టీడీపీ మండల కో-కన్వీనర్ జాకీర్, గాదిలింగ,బుడగజంగాల రామాంజి,టీడీపీ మండల మైనార్టీ అధ్యక్షులు ముల్లా మొయిన్,సురేష్,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల నివాళులు

**కురవి :** మండల కేంద్రానికి చెందిన బండారి రమేష్ సతీమణి, అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కురవి మండల కేంద్రంలోని వీరభద్ర ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆమె దశదిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై నివాళులర్పించారు.ఈ సందర్భంగా మహేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్, కురవి టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేంద్రకుమార్, సమన్వయ కమిటీ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్ర గౌడ్, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షులు అవిరే మోహన్ రావు, బానోత్ తుకారం నాయక్, ఆలయ ధర్మకర్త సక్రు నాయక్, నేరడ సర్పంచ్ గౌతమి వెంకన్న, గ్రామ అధ్యక్షులు బానోతు లాల నాయక్, బాదావత్ రామకృష్ణ, రాములు వెంకన్న, కురవి మాజీ వార్డు సభ్యులు బానోతు లక్ష్మణ్ నాయక్, గుగులోతు బాలాజీ, దెబ్బేటి వెంకటయ్య, రామ్మూర్తి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.